క్లుప్తంగా

క్రీడాకారులకు జెర్సీల పంపిణీ



ఫుట్‌బాల్ శిక్షణలో పాల్గొన్న యువకులతో క్లబ్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: ఫోర్టు యూనియన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌యూఎఫ్‌సీ) ఆధ్వర్యంలో 39వ వార్డు పరిధి సెయింట్ అల్లాయిస్ క్రీడా మైదానంలో ని ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ఆదివారం జెర్సీలు అందజేశారు. ఈ శిక్షణ తరగతులు వచ్చే నెల 4 వరకు నిర్వహించనున్నట్టు క్లబ్ కార్యదర్శి మోది గణేశ్వరరావు తెలిపారు. ప్రతి ఏడాది ఈ శిక్షణ శిబిరం నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. కార్యక్రమంలో కోటవీధి ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలే అంబేడ్కర్‌కు మార్గదర్శకం



విద్యార్థులకు విజ్ఞానదాయక విషయాలు తెలియజేస్తున్న ప్రొఫెసర్ సంజీవ్

అల్లిపురం: గ్రంథాలయాలే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు మార్గదర్శకాలు అయ్యాయని మేరీ టైం యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.సంజీవ్ అన్నారు. గ్రంథాలయాల్లో 14 వేల పుస్తకాలు చదివి అంబేడ్కర్ 14 డిగ్రీలు సాధించారన్నారు. సంపూర్ణ జ్ఞానంతో రాజ్యాంగ నిర్మాత అయ్యారని వివరించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అల్లిపురం శాఖా గ్రంథాలయంలో జరిగిన శిక్షణ శిబిరంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానార్జనతో ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా పది మంది విద్యార్థులు నెలవారీ ధరావతు చెల్లించి సభ్యత్వం స్వీకరించారని గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీకి వెంకటరమణయ్య పార్థివదేహం



వెంకటరమణయ్య పార్థివదేహాన్ని మెడికల్ కాలేజీకి అందజేస్తున్న దృశ్యం

మహారాణిపేట : రామ్‌నగర్ ఫేకర్స్ కాలనీలో ఉంటున్న వబ్బిలిశెట్టి వెంకట రమణయ్య (98) పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు ఆదివారం ఆంధ్రా మెడికల్ కాలేజీకి అప్పగించారు. అనారోగ్య కారణాలతో శనివారం రమణయ్య మృతి చెందారు. సావిత్రిబాయిపూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ సీతామహాలక్ష్మి ద్వారా రమణయ్య కుమారుడు శ్రీనివాసరావు తదితరులు రమణయ్య అంతిమ కోరిక మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు.

వాకర్స్ క్లబ్ సభ్యులకు ఐడీ కార్డులు



వాకర్లకు గుర్తింపు కార్డులు అందిస్తున్న ద్వారకానాథ్

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ప్రాంగణంలో ఆదివారం వాకర్లకు ఫొటో గుర్తింపు కార్డులను అందజేశారు. వాకర్స్ అంతర్జాతీయ కార్యదర్శి కె.ద్వారకానాథ్ మొదటి ఐడీ కార్డును వాకర్స్ పార్కు పూర్వ అధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్యకు అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి వాకర్స్ పార్కు సభ్యులందరికీ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి లంకా సుధాకర్, ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ, కోశాధికారి జె.కూర్మారావు పాల్గొన్నారు.

ఘనంగా ఎర్నిమాంబ జాతర



ఆలయం వద్ద భక్తుల సందడి



మూలవిరాట్ వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు పరిధి జ్ఞానాపురం, అల్లిపురం ప్రజల ఇలవేల్పు ఎర్నిమాంబ అమ్మవారి జాతరను దేవదాయ శాఖ, ఆయా సంక్షేమ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి ఆలయ దర్శనాలకు క్యూలైన్లలో బారులు దీరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ, ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయ నేతృత్వంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నగరం నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మూలవిరాట్‌ను, సుమారు 35 అమ్మవారి ప్రతిమలను భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతరలో నేలవేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. దేవదాయశాఖ ఈవో బాబా, ఆయా సంఘాల ప్రతినిధులు, ఆలయ సిబ్బంది జాతరను పర్యవేక్షించారు.

శిథిల రహదారితో సమస్యలు



పాడైన టింపనీ స్కూల్ రోడ్డు

సీతమ్మధార : నగరంలోని పలు రహదారులు ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. జీవీఎంసీ 27వ వార్డులోని టింపనీ స్కూల్‌కు వెళ్లే రహదారి గోతులమయంగా మారి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రిపూట ఈ దారిలో ప్రయాణించేందుకు భయపడుతున్నారు. భారీ వాహనాలు తరచూ రాకపోకలు సాగిస్తుండడంతో ఈ రోడ్డంతా శిథిలమయింది. లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్లు ఇలా శిథిలం కావడానికి నాసిరకం పనులే కారణం అని పాదచారులు, వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ల పనితీరును జీవీఎంసీ అధి కారులు పర్యవేక్షణ చేస్తే ఇటువంటి సమస్యలు తలెత్తవని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇతరుల కోసం సమయం కేటాయించండి



వైట్‌బోర్డులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

సీతంపేట: విజయానికి చదువు ఒక్కటే కొలమానం కాదని, సమాజంలో ఇతరుల కోసం కొంత సమయం కేటాయించడమే నిజమైన సక్సెస్ అని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ అన్నారు. ఆసరా చారిటబుల్ సొసైటీ 9వ వార్షికోత్సవ సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఆసరా సేవలను కొనియాడారు. ఆసరా అధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ 2014 నుంచి ఇప్పటి వరకు ఎన్నో సేవా కార్యక్రమాలతో తమ సొసైటీ ముందుకు వెళ్తోందన్నారు. ఇన్‌కంటాక్స్ అడిషనల్ కమిషనర్ గోపీకృష్ణ, కోరెడ్ల రమాప్రభ పాల్గొన్నారు.

నీటి స్వచ్ఛతను పరిశీలించిన అధికారులు



మంచినీటి కుళాయిల్లో వస్తున్న నీటి స్వచ్ఛతను పరిశీలిస్తున్న అధికారులు

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట, అంబేడ్కర్ కాలనీ, లక్ష్మీదేవిపేటలోని కొన్ని ప్రాంతాల్లో మంచినీటి కుళాయిల్లో మురుగునీరు, పురుగులు వస్తున్నాయని వార్డు ప్రజల విన్నపం మేరకు అధికారులు స్పందించారు. వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అధికారులతో సంప్రదించి సమస్యను ఈఈ శేఖర్‌కు, ఎస్ఈ వేణుగోపాలరావులకు తెలియజేయటంతో వారు ఆదివారం వార్డులో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను కొంత మేర పరిష్కరించారు. మరొక రెండు రోజులు పరిశీలించిన అనంతరం సమస్య పూర్తిగా పరిష్కారం కాని ఎడల చర్యలు తీసుకుంటామని డీఈ శ్రీనివాసవర్మ, ఏఈ రవికుమార్, వాసుదేవన్ తెలిపారు. ఇప్పటికే సమస్య పూర్తిగా తొలగిపోయిందని వారు తెలిపారు. వార్డు సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడు పావనమూర్తికి సత్కారం



ప్రొఫెసర్ పావనమూర్తిని సత్కరిస్తున్న బుద్ధిస్ట్ సొసైటీ ప్రతినిధులు

సింధియా: బౌద్ధ మతం నలుదిశలా విస్తరించేందుకు పాటుపడిన అంబేడ్కరిస్ట్, భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షుడు, భీమ్‌దళ్ చీఫ్ కమాండర్ ప్రొఫెసర్ పావనమూర్తిని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ) విశాఖ బ్రాంచ్ ప్రతినిధులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. 98 ఏళ్ల ప్రాయంలో మంచానికి పరిమితమైన ఆయనను సీతమ్మధారలోని స్వగృహంలో కలిసి ఘనంగా సత్కరించారు. బీఎస్ఐ సెక్రటరీ కర్రి సత్యనారాయణ మాట్లాడుతూ పావనమూర్తి దేశవ్యాప్తంగా సంచరిస్తూ తెలుగు, హిందీ, మళయాళం మొదలగు భాషల్లో తన ప్రసంగాలతో యువతను ఉత్తేజపరుస్తూ సమసమాజ స్థాపన కృషి చేశారన్నారు. అనేక పురస్కారాలు, అవార్డులు, పదవులు సొంతం చేసుకున్నారని కొనియాడారు. బీఎస్ఐ ప్రతినిధి దుర్గారావు మాట్లాడుతూ అణగారిన వర్గాల తరపున పోరాడి న్యాయం జరిగే వరకు అలుపెరగకుండా పోరాడే వారని, కుల నిర్మూలన, బౌద్ధ ధర్మ వ్యాప్తికి చేసిన కృషి అభినందనీయమన్నారు. బీఎస్ఐ ప్రతినిధులు పెయ్యల సిద్ధార్థ, రాజారావు, యు.వి.రావ్, రాంజీ పాల్గొన్నారు.

దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీకి నివాళులు



రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహారాణిపేట : జాతీయ ఉగ్రవాద దినం సందర్భంగా దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద మానవసేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్ నివాళులు అర్పించారు. ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ 1991, మే 21న ఉగ్రవాదుల బాంబు దాడిలో దుర్మరణం చెందారని, నాటి నుంచి కేంద్ర ప్రభుత్వం మే 21వ తేదీన జాతీయ ఉగ్రవాద దినంగా నిర్వహిస్తుందని రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్. లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎస్. శ్రీలక్ష్మి, జయంతి అన్నపూర్ణ మౌనిక, జయంతి ఫణిరక్షిత్, జయంతి ఫణికాత్య, క్షీరాబ్ధి దుతి, గేదెల శ్రీహరి, డాక్టర్ వై. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

దాబాగార్డెన్స్: నగర కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. పార్టీ నగర అధ్యక్షుడు గొంప గోవిందరావు, పలువురు పార్టీ నాయకులు పాల్గొని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ భారతదేశానికి సాంకేతికతను పరిచయం చేసిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బమ్మిడి గంగాధర్, గుత్తుల శ్రీనివాస్, మూల వెంకట్రావు, సోడదాసు సుధాకర్, తోట వాసుదేవరావు, గోవింద్, తమ్మిన నాయుడు, కస్తూరి వెంకట్రావు, శివ, శ్రీనివాస్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జోడో యాత్రతో గడగడలాడుతున్న బీజేపీ

దాబాగార్డెన్స్: రాజీవ్‌గాంధీ తనయుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గడగడలాడుతోందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు, శ్రీశయన సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు తోట వాసుదేవరావు అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని కెప్టెన్ రామారావు జంక్షన్ వద్ద గల రాజీవ్ విగ్రహానికి ఆదివారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారతదేశాన్ని ప్రపంచ పటంలో నిలిపిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. భారతదేశాన్ని కాంగ్రెస్ పార్టీ మాత్రమే అభివృద్ధి చేయగలదని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్రతో కర్ణాటక రాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జోష్‌తో ప్రభుత్వం చేపట్టిందన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయని, త్వరలో జరగనున్న తెలంగాణ, మధ్యప్రదేశ్, చత్తీష్‌ఘడ్, రాజస్థాన్ అంసెబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్. గురునాథరావు, వాసుపల్లి సత్తిబాబు, ఎల్. కనకరాజు, ఎస్. బాబ్జి, రవి, బి. రాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ రోగులను ఆదరిద్దాం

మహారాణిపేట : అంతర్జాతీయ ఎయిడ్స్ స్మృత్యంజలి దినం సందర్భంగా ఆదివారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ర్యాలీని ప్రారంభించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి విప్రో జంక్షన్ వరకు ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ బలమైన సమాజాన్ని నిర్మించడానికి హెచ్ఐవీతో జీవిస్తున్న వారి పట్ల ప్రేమ, సంఘీభావం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ రామారెడ్డి, నాగభూషణం, శైలజ, బద్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సమస్యపై ఎమ్మెల్యే సమీక్ష

సింహాచలం: జీవీఎంసీ 97వవార్డు పరిధి కార్మిక నగర్, అంబేడ్కర్ నగర్‌లో ఇళ్ల స్థలాల సమస్యపై ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పెందుర్తి తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ ప్రాంతంలో లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల సమస్యపై అధికారులతో చర్చించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



కలశాలకు పూజలు చేస్తున్న గ్రామ సేవా సంఘం సభ్యులు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలోని కోదండరామయ్య సహిత వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి అర్చకులు విష్వక్సేన, పుణ్యాహవచనం, రక్షాసూత్రధారణ, రుత్విక్ వరుణుల మండపారాధన నిర్వహించారు. అనంతరం అష్టోత్తర శత కలశ అభిషేకం జరిపారు. విశేష హోమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో శ్రీవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయం గోవింద నామ స్మరణతో మార్మోగిపోయింది. భక్తులకు మజ్జిగ, ప్రసాదం అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

సింహాచలం: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, జ్యోతిష్య పండితుడు మందారపు సత్యనారాయణ అన్నారు. అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న మందారపు సత్యనారాయణ పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అలాగే పలు వ్యర్థాలతో వివిధ రకాల ఆకృతులు తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. ఆధ్యాత్మిక పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. పర్యావరణం బాగుంటేనే మానవ సమాజం బాగుంటుందని తెలిపారు. మెరుగైన పర్యావరణానికి పచ్చదనం పరిరక్షణకు పాటుపడాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ రీడర్స్ ఫోరం కమిటీ అధ్యక్షుడు బి.బి.రాజేంద్ర ప్రసాద్, గ్రంథాలయాధికారి ఎస్.వి. నరసింహం, ఆయుర్వేద వైద్యుడు డి.కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కథలతో మేధో వికాసం



కథలు చదువుతున్న విద్యార్థులు

మురళీనగర్: సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఆదివారం మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో విద్యార్థులతో కథలు చదివించారు. గ్రంథాలయ అధికారి వై.పద్మజ ఆధ్వర్యంలో కథలు చదివించడం, వాళ్ల చేత చెప్పించడం జరిగింది. ఆధ్యాత్మిక వేత్త కె.కాశీ విశ్వనాథ్ రిసోర్స్ పర్సన్‌గా పిల్లలకు కథలపై కొన్ని విషయాలను తెలియజేశారు. మేధో వికాసానికి కథలు చదవాలని సూచించారు. పిల్లలతో క్యారమ్ బోర్డు ఆడించారు. అనంతరం చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. పాఠకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు.. పాత్‌వేలు వదిలేశారు.!



కైలాసగిరిపై రాతి శిల పార్కు

ఆరిలోవ: నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరిపై రాతి శిల పార్కు విగ్రహాలకు మాత్రమే పరిమితమైంది. ఈ పార్కులో విగ్రహాల మధ్య గతంలో ఫుట్‌పాత్‌లు ఉండేవి. ఇటీవల నగరంలో జరిగిన జీ-20 సదస్సులో పర్యాటక కేంద్రాలు అభివృద్ధిలో భాగంగా వీఎంఆర్‌డీఏ కైలాసగిరిపై పలు పనులు చేపట్టింది. ఇందులో భాగంగా ఇక్కడ రాతి శిల పార్కులో గతంలో ఉన్న ఫుట్‌పాత్‌లు తొలగించి విగ్రహాల మధ్యన ఖాళీ స్థలాల్లో పూల మొక్కలు నాటారు. సందర్శకులు నడవడానికి వీలుగా కొత్తగా పాత్‌వేలు నిర్మించాల్సి ఉంది. కానీ ఇప్పటికీ పాత్‌వేలు నిర్మించకుండా వదిలేశారు. దీనివల్ల ఈ పార్కు లోపల వేసిన మట్టిపై రాళ్లు పైకి తేలడంతో సందర్శకులు నడవలేని పరిస్థితి నెలకొంది. దీంతో సందర్శకులు లోపలకు వెళ్లకుండా రోడ్డు మీద నుంచే చూసుకుంటూ వెళ్లిపోతున్నారు. ఇక్కడ నడవడానికి వీలుగా పాత్‌వేలు నిర్మించి రాతి విగ్రహాలను దగ్గరుండి తిలకించే అవకాశం కల్పించాలని వీఎంఆర్‌డీఏ అధికారులను సందర్శకులు కోరుతున్నారు.

సాముగరిడీ శిక్షణకు విశేష స్పందన



మెమొంటోలతో క్రీడాకారులు, గ్రామ కమిటీ సభ్యులు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం శ్రీరామా సేవా సమాజంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నిర్వహించిన సాముగరిడీకి మంచి ఆదరణ లభించిందని గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ తెలిపారు. సమాజం ఆధ్వర్యంలో ఆదివారం సీతారామ కల్యాణ మండపంలో జరిగిన వేడుకల్లో సాముగరిడి గురువు సానబోయిన అప్పలరాజును గ్రామ కమిటీ సభ్యులు, క్రీడాకారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ అంతరించి పోతున్న క్రీడల్లో సాముగరిడి ఒకటని, దానిని నేటి విద్యార్థులకు నేర్పించాలనే తపన ఉందన్నారు. వేసవిలో అనేక మంది క్రీడాకారులు సాముగరిడి నేర్చుకోవడం అభినందనీయమన్నారు. పల్లా సత్యనారాయణ సొంత నిధులతో క్రీడాకారులకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వై.వెంకటరావు, పి.వెంటకరమణ, పి.పెంటారావు, ఎస్.సంపత్, డి.రమణ, ఎస్.శంకరరావు, కె.వి.అప్పారావు, నూనెల రామారావు, పల్లా వెంకటరావు, కోనా రాము, పల్లా ధర్మారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కె.పి.రత్నాకర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జీతాలెలా ఇస్తున్నారు?

- ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం ద్వారా హాజరు నమోదు చేయని 30 మంది ఉద్యోగులు
- పర్యవేక్షణ లోపమే కారణమని విమర్శలు



జోన్-4 సౌకర్యం కార్యాలయం

జగదాంబ: ఆ ఉద్యోగులకు హాజరు లేదు.. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) లేదు. కాని జీతాలు మాత్రం ఇస్తున్నారు. ఎలా..? జీవీఎంసీ జోన్-4లో సమారు 30 మంది ఉద్యోగులకు సంబంధించిన అంశం ఇది. గతంలో హాజరుంటే సరిపోయేది. కాని ఇప్పుడు ఉన్నతాధికారులు సైతం కార్యాలయానికి వచ్చినట్టు అత్యాధునిక టెక్నాలజీ కలిగిన ఎఫ్ఆర్ఎస్‌ను ఉపయోగించుకుని కార్యాలయంలోకి వెళ్లాల్సిందే. అయితే ఈ అవసరం లేకుండా ఆ 30 మంది ఎలా విధులు నిర్వర్తిస్తున్నారో అగమ్యగోచరంగా ఉంది. జీవీఎంసీ జోన్-4 పరిధి పారిశుధ్య విభాగానికి చెందిన సుమారు 30 మంది కార్మికులు జీవీఎంసీ సౌకర్యం సెంటర్, జోనల్ అధికారి కార్యాలయం, రెవెన్యూ సెక్షన్ వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. వీరందరూ జీవీఎంసీ 28, 29, 30 వార్డులకు చెందినవారే. ఒక్క ఎంఎస్ఎఫ్-4 టౌన్‌కొత్త రోడ్డు డంపింగ్ యార్డులోనే ఎనిమిది మంది వరకు ఉన్నారు. వారందరికీ ఎఫ్ఆర్ఎస్ పద్ధతిలో హాజరు నమోదు కావడంలేదు. అయినప్పటికీ వారందరు డ్యూటీ సర్టిఫికెట్లు సబ్మిట్ చేస్తున్నారు. నెలయ్యేసరికి జీతాలు తీసుకుంటున్నారు. వార్డు ఇన్‌స్పెక్టర్ల ఉదాసీనత, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వలన వీరందరూ ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు పని చేసినట్టు నమోదు చేయాల్సిన ఎఫ్ఆర్ఎస్ నమోదు చేయడంలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే కొన్ని సంవత్సరాలుగా ఈ తంతు జరుగుతుందని పలువురు చెబుతున్నారు. ఆరోగ్యం బాగులేక సెలవు అడిగితే మంజూరు చేయడానికి పరిపరి విధాల ఆలోచించే అధికారులు ఎఫ్ఆర్ఎస్ లేకుండా వారిని ఎలా కొనసాగిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై జీవీఎంసీ ఉన్నతాధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జోనల్ కార్యాలయంలో ఉన్న వారిని వెనక్కి పంపిస్తాం



జోనల్ కార్యాలయంలో ఉన్న వారిని వెనక్కి పంపిస్తాం. ఎఫ్ఆర్ఎస్ తీసుకున్న తర్వాతే జీతాలు ఇస్తాం. వాస్తవంగా ఎఫ్ఆర్ఎస్ సాంకేతిక లోపం వల్ల కొన్నిసార్లు అవడంలేదు. క్లాప్ వాహనాలపై వెళ్లే వారికి ఇబ్బందులు ఉన్నాయి. వాటిని సమీక్షిస్తాం. ఎఫ్ఆర్ఎస్ పూర్తి నిర్వహణ బాధ్యత వార్డు ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ సెక్రటరీలదే. వారు దీనిని పరిశీలించాలి.

–డాక్టర్ ఎస్.కిశోర్,
ఏఎంహెచ్‌వో, జీవీఎంసీ జోన్-4.

'రూ.2వేలు నోటు రద్దు అనాలోచిత నిర్ణయం'

మద్దిలపాలెం: ఆర్‌బీఐ ఆకస్మికంగా రూ. 2 వేలు నోటు రద్దు చేయడం అనాలోచిత నిర్ణయమని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూలా వెంకటరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగదు ఆధారిత లావాదేవీలు జరిపే వ్యక్తులు, సంస్థల వద్ద ఈ నోట్లు పెద్ద సంఖ్యలో ఉంటాయన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల దృష్టి మరల్చాలనే ఇలా చేస్తున్నారని విమర్శించారు. ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదన్నారు.